ప్రజాశక్తి

శుక్రవారం 19 సెప్టెంబర్ 2025 1

అనంతపురం శ్రీ సత్యసాయి







మహాసభలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

సమస్యలపై ఐక్యపోరాటాలు

- ఆశాలకు కనీస వేతనం అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

3వ పేజీ

రైతులకు అందుబాటులో ఉండాలి

- యూరియా కొరత రానీయొద్దు
- అనంత కలెక్టర్ ఓ.ఆనంద్



వార్త 10లో

కరువును తట్టుకునేలా పంటల సాగు

- ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలి
- శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



వార్త 3లో

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతిచెందిన ఓబులేశు

రాయదుర్గం : పట్టణంలోని కోట ముఖద్వారం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన ఎర్రల్లి నాగరాజు, మారమ్మ గుడి ప్రాంతానికి చెందిన నాయకుల ఓబులేసు టీ తాగేందుకు కోట ముఖద్వారం వద్ద నడుచుకుంటూ వస్తుండగా బెంగళూరు వైపు నుంచి వచ్చిన ఓ ప్రయివేటు బస్సు ఢీకొంది. దీంతో చక్రాల కింద పడి ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకువెళ్లారు. అయితే ఓబులేసు (60) అనంతపురంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. నాగరాజు పరిస్థితి విషమంగా ఉంది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిని చంపిన తనయుడు


మృతిచెందిన సుధాకర్

పామిడి : మండల కేంద్రంలోని బెస్త వీధికి చెందిన బెస్త సుధాకర్(45)ను కుమారుడు ప్రకాష్ హత్య చేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బెస్త సుధాకర్ ఐచర్ లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. అయితే రోజూ మద్యం తాగి వచ్చి భార్య మీనాక్షితో గొడవ పడుతుండేవాడు. ఇందులో భాగంగానే బుధవారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. దీంతో తీవ్ర కోపోద్రిక్తుడైన కుమారుడు ప్రకాష్ అక్కడే ఉన్న రోకలిబండతో సుధాకర్ తలపై బాదాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని తల్లీకొడుకును అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బండరాయి మీద పడి యువకుడు మృతి


చంద్ర (పాతచిత్రం)

తనకల్లు : శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. తనకల్లు ఎస్సీ కాలనీకి చెందిన చంద్ర (30) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం మండల పరిధిలోని మండ్లిపల్లి మిట్ట వద్ద నల్లగుట్టలో జెసిబితో నేల చదును చేసేందుకు వెళ్లాడు. ఈ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పెద్ద బండరాయి చంద్ర మీద పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించాడు. మతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ఇఇ ప్రసాద్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ రూ.50లక్షల నిధులతో ప్రాథమిక కేంద్రం పనులను ప్రారంభించినట్లు తెలిపారు. పనులను ప్రారంభించి 8 నెలలు కాగా ఇంకా పూర్తి కాకపోవడంతో పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. వెంటనే నాణ్యంగా భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇ రవిశంకర్‌రెడ్డి, ఎఇ నాగేంద్రప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు గురువారం నగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక నగరపాలక సంస్థ నుంచి ప్రారంభమైన ర్యాలీ టవర్‌క్లాక్ వరకూ సాగింది. అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనందున మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా 12వ పిఆర్‌సి అమలు చేసి కార్మికులందరికీ వేతనాలు ఇవ్వాలని, గత వైసిపి ప్రభుత్వంలో 17రోజుల సమ్మెలో భాగంగా ఒప్పంద జీవోలను అమలు చేయాలని కోరారు. అంతేగాకుండా ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, కోవిడ్, మలేరియా, గార్బేజ్, క్లాప్ ఆటో బదిలీ కార్మికులకు రూ.21,000 వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని, లేనిపక్షంలో ఈనెల 23న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి నిరసిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షులు టి.గోపాల్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రెగ్యులర్ కార్మికుల పట్టణ అధ్యక్షులు ఎల్.ముత్తురాజు, ఇంజినీరింగ్ సెక్షన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, ట్రెజరర్, లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, రాఘవేంద్రప్రసాద్, శశీంద్రకుమార్, సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, వరలక్ష్మి, కొనప్ప, నాగేంద్ర, మరియమ్మ, నల్లప్ప, జయరామ్, ఇమాంబీ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.రామాంజనేయులు, గుత్తి మున్సిపాలిటీ అధ్యక్షులు ఎస్.రాజా, కె.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు ఆది, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కారం చూపాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు మున్సిపల్ కార్మికులతో కలిసి గురువారం పట్టణంలోని వినాయక కూడలి నుంచి లక్ష్మీబజార్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, రాము, తిప్పేరుద్ర, నరసింహులు, తిప్పేస్వామి, ఆదిలక్ష్మి, వన్నూరమ్మ, సిద్దలింగ, తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు


అనంతపురంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కళ్యాణదుర్గం టౌన్ : మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని మున్సిపాలిటీ ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ సర్కిల్, టీసర్కిల్ వరకూ సాగింది. అక్కడ నరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.వన్నూరుస్వామి, అధ్యక్షులు నటరాజు, కోశాధికారి దుర్గమ్మ, కమిటీ సభ్యులు ఎ.వెంకటేశులు, శివకుమార్, తిమ్మప్ప, కార్మికులు పాల్గొన్నారు.

వాహనమిత్ర గడువు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి-తాడిపత్రి


విలేకరులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహనమిత్ర పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఉమా గౌడ్, నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలన్నారు. గతంలో కేవలం లైసెన్స్‌తోపాటు వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్ ఉంటే అర్హులుగా ప్రకటించారన్నారు. అయితే ఇప్పుడు వాటితోపాటు వాహనం బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు అడగడం మంచిది కాదన్నారు. కావున వెంటనే ఎలాంటి షరతులు లేకుండా వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు దరఖాస్తు చేసుకునేందుకు తక్కువ సమయం ఇవ్వడంతో చాలామంది ఆటో కార్మికులు దిక్కుతున్న పరిస్థితుల్లో ఉన్నారన్నారు. కావున గడువు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కోశాధికారి హనుమంతురెడ్డి, సిఐటియు నాయకులు రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సంతకాల సేకరణ

ప్రజాశక్తి-గుంతకల్లు


సంతకాలు సేకరిస్తున్న క్షవర వృత్తిదారులు

పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని క్షవర వృత్తిదారులు కసాపురం రోడ్డు వాల్మీకి కూడలిలో చేపట్టిన సంతకాల సేకరణ గురువారం రెండవ రోజు కూడా కొనసాగింది. వీరికి మద్దతుగా ప్రజలు ప్రజా సంఘాల నాయకులైన డివైఎఫ్ఐ నాయకులు సురేంద్రబాబు, వాల్మీకి సంఘం పట్టణ అధ్యక్షులు యల్లప్ప, టిఎన్ఎస్ఎఫ్ సురేష్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్ గౌడ్, యువనేత అనిల్‌కుమార్‌గౌడ్, మాజీ పట్టణ అధ్యక్షుడు ముక్కన్నగారి రామాంజనేయులు, పార్టీ జిల్లా పార్లమెంటు కురుబ సాధికార జిల్లా అధ్యక్షుడు, కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు కురుబ చంద్రశేఖర్, వివిధ ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షవర వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి సూరి, అధ్యక్షులు బెలగంటి లక్ష్మీనారాయణ, నాయకులు బ్రహ్మ, అంజి, సాగర్, సురేంద్ర, శివ, లీలాకుమార్, అజయ్, వాసు, బాలకృష్ణ, బాలసాయి, తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్


డప్పులు కొడుతున్న కళాకారులు

డప్పు కళాకారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం తాడిపత్రి మండల కమిటీ ఆధ్వర్యంలో డప్పు కళాకారులు ర్యాలీ నిర్వహించి ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇఒఆర్‌డి రవికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి డప్పు కళాకారులు డప్పు శబ్దంతో ఆట, పాటలతో సమాజాన్ని కదిలించారన్నారు. ముఖ్యంగా జిల్లాలో వేలాదిమంది డప్పును కళను నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలన్నా, పండుగలు, జాతర్లు, పెళ్లిళ్లు, రాజకీయ నాయకుల సభలు, ఊరేగింపులు జరగాలంటే డబ్బు కళాకారుల పాత్ర కీలకమన్నారు. అయితే ఈ వృత్తిపై జీవిస్తున్న వారందరూ దళితులే అన్నారు. 2020 తర్వాత డప్పు కళాకారులకు కొత్త పింఛన్లుగానీ, గుర్తింపు కార్డులుగానీ ఇవ్వలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అర్హులైన డప్పు కళాకారులకు కొత్త పింఛన్లు ఇవ్వాలని కోరారు. అలాగే అర్హతకు 45 సంవత్సరాలకు పరిమితి తగ్గించాలని, ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ రూ.7వేలకు పెంచి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం నాయకులు పెద్దన్న, చంద్ర, గోవిందప్ప, గుర్రప్ప, నారాయణస్వామి, రంగప్ప, రంగనాయకులు, ఓబులేసు, శ్రీరాములు, రామ్మోహన్, సిఐటియు నాయకులు ఉమాగౌడ్, హనుమంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనంతపురం

కౌలు రైతుల హక్కుల సాధన కోసం ఈనెల 22వతేదీన చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశులు పిలుపునిచ్చారు. గురువారం విడపనకల్లు మండల పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన కౌలు చట్టం తీసుకురావాలని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు కౌలు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పాత చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకురావాలన్నారు. ఆయా సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి వెంకటేష్, నాయకులు దుర్గప్ప, విజయరామాంజనేయులు, సుంకన్న, రామాంజి, నారాయణస్వామి, సూరి, సుంకన్న, ఆంజనేయ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్యపోరాటాలు



మహాసభల్లో ప్రసంగిస్తున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

ఆశాలకు కనీస వేతనం అమలు చేయాలి

ఇతర సమస్యలనూ పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

అనంతలో యూనియన్ జిల్లా 2వ మహాసభలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆశాకార్యకర్తలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంపై ఐక్య పోరాటాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్ పిలుపునిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) అనంతపురం జిల్లా మహాసభలు గురువారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. ఆశా వర్కర్ వరలక్ష్మి ఆ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. మహాసభ సందర్భంగా ఇటీవల మృతి కార్మికులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి నివాళులు అర్పించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాలతి, ఉపాధ్యక్షురాలు ప్రమీల అధ్యక్షతన నిర్వహించిన మహాసభకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాలు అనుసరిస్తూ కార్మికుల హక్కులు కాలరాస్తున్నాయని తెలిపారు. హక్కుల సాధాన కోసం ఐక్య పోరాటాలే మార్గమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మతోన్మాదాన్ని చొప్పించి చీలిక తెస్తోందన్నారు. కార్పొరేట్ విధానాలు అనుసరిస్తున్న కార్మికుల హక్కులు హరించేలా చట్టాలు సవరించిందన్నారు. మతతత్వ విధానాలు చొప్పించి అధికారమే పరమాధిగా పని చేస్తోందన్నారు. అలాంటి బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కూడా మద్దతునిస్తూ ప్రజలపై భారాలు మోపడానికి కారణం అవుతోందన్నారు. రాష్ట్రంలో పేదలు వేసుకున్న గుడిసెలు స్థలాలపై దాడులు చేసి ఖాళీ చేయిస్తోందని, అదే కార్పొరేట్ సంస్థలకు మాత్రం ఒక రూపాయికి ఎకరా చొప్పున వందలాది ఎకరాలు అప్పగించదని విమర్శించారు. ఉచిత విద్యా, వైద్యంను ప్రజలకు దూరం చేస్తూ ప్రయివేటీకరణను ప్రోత్సహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేవారు. ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కరలకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. వేతనంతో కూడిన మెటర్నటి సెలువులు అమలు చేయాలన్నారు. ఆశాలకు వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంపుదల చేయాలన్నారు. మెడికల్, క్యాజువల్ సెలవులు వర్తింపజేయాలన్నారు. మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలన్నారు. జనాభాకు అనుగుణంగా ఆశా కార్మికుల నియామాకాలు చేపట్టాలన్నారు. ఆశాలకు అదనపు విధులు అప్పగించరాదన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ జిల్లాలో ఆశా కార్మికులు సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా కోశాధికారి గోపాల్ మాట్లాడుతూ ఆశా కార్మికుల హక్కుల సాధనకు సిఐటియు మద్దతుగా పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మన్నీల రామాంజినేయులు, ముర్తుజా, ఆశా కార్మికుల యూనియన్ నాయకులు కుళ్లాయమ్మ, రాధమ్మ, స్రవంతి పాల్గొన్నారు.


నూతన కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ అనంతపురం జిల్లా నూతన కమిటీ 30 మందితో 12 మంది ఆఫీస్ బేరర్స్‌లను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మాలతి, ఎం.నాగమణి, కోశాధికారిగా భారతి, ఉపాధ్యక్షులుగా సుజాత, ప్రమీల, వరలక్ష్మి, భాగ్యమ్మ, పద్మావతి, జిల్లా సహాయ కార్యదర్శులుగా కళావతి, వెంకటలక్ష్మి, దస్తగిరమ్మ, సరస్వతిలను ఎన్నుకున్నారు.


వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

కరువును తట్టుకునేలా కొత్త పంటల సాగు

ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా వ్యవసాయంలో కరువును తట్టుకునే కొత్త పంటలను రైతులకు పరిచయం చేసి, వాటి సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వ్యవసాయ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ హాలులో ప్రైమరీ సెక్టార్‌లో భాగంగా వ్యవసాయం ఉద్యానవనం, పట్టు పరిశ్రమ, సూక్ష్మ నీటిపారుదల, పశు సంవర్ధకం ఫిషరీస్, మార్కెటింగ్, సహకార రంగం, ఎల్డిఎం తదితర శాఖల జిల్లా అధికారులు, డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైమరీ సెక్టార్ రంగంలో వ్యవసాయ అనుబంధ శాఖల స్థూల ఆదాయం 15శాతం ఆపైన వచ్చేలా ప్రణాళికలు రచించాలని ఆదేశించారు. ప్రధానంగా ఆయా శాఖల ద్వారా జిల్లాలో స్థూల ఆదాయాన్ని 15శాతం ఆ పైన వచ్చేలా ప్రణాళికలు రచించి అమలు చేయాలన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా వివిధ పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. సూక్ష్మ నీటిపారుదల ద్వారా లక్ష్యాలను అధిగమించాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలలో ఉత్పత్తుల నాణ్యతను పెంచే ప్రణాళికలతో స్థూల ఆదాయం పెంచాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా "చియా" వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రయత్నించి కరువును తట్టుకునే పంటలు పరిచయం చేయాలన్నారు. జిల్లాలో విస్తతంగా నీటి కుంటలు నిర్మించాలని సూచించారు. జిల్లాలో ప్రధాన పంట అయిన టమోటా ధరలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ధరల స్థిరీకరణ మార్గాలు, అందుకు సంబంధించిన ప్రణాళికలతో కార్యాచరణ అమలు చేయాలన్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు టమోటా పంట ధరలు పెరగడం తగ్గడం ప్రక్రియలో తేడాలు గమనిస్తూ రైతులకు ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇవ్వాలని చెప్పారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న వార్షిక ప్రణాళికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రాస్ వాల్యూ అడిషన్ పెంచే మార్గాలపైన దృష్టి సారించేలా తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రాము నాయక్, సిరికల్చర్ జెడి శోభారాణి, ఏపీఎంఐపి పీడీ సుదర్శన్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ గీత, మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఎల్డీఎం రమణకుమార్, కో-ఆపరేటివ్ అధికారి కృష్ణ నాయక్, నాచురల్ ఫార్మింగ్ అధికారి లక్ష్మానాయక్, ఆయా శాఖల డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తండ్రీకూతుళ్ల సెల్ఫీ వీడియో కలకలం.!

క్వారీ బ్లాస్టింగ్‌తో పంట నష్టమంటూ బాధితుల కన్నీరు

అధికారులెవరూ పట్టించుకోవడం లేదంటూ ఆవేదన

తహశీల్దార్ జోక్యంతో సద్దుమణిగిన వివాదం


బాధిత తండ్రి బొమ్మయ్య, కూతురు భారతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం మండలం తూర్పుకోడిపల్లిలో ఓ కుటుంబం ఆత్మహత్య సెల్ఫీ వీడియో కలకలం రేపింది. క్వారీ వల్ల తమ పంట నష్టపోతున్నామంటూ క్వారీపైకి తండ్రీ కూతుర్ల సెల్ఫీ వీడియో విడుదల చేశారు. గురువారం చోటు చేసుకున్న ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. బాధితులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కళ్యాణదుర్గం మున్సిపాల్టీ పరిధిలోని ముదిగల్లు గ్రామానికి చెందిన గొల్ల బొమ్మయకు తూర్పుకోడిపల్లి రెవెన్యూ పరిధిలో పొలం ఉంది. అక్కడ ఆనుకుని సర్వే నెంబర్-55లో 6 ఎకరాల రాతిబండ విస్తీర్ణం ఉంది. ఈ బండ విస్తీర్ణానాన్ని క్వారీగా ఉపయోగించుకోవడానికి పట్టణ సమీపంలోని క్రషర్ యజమాని, మాజీ ఎమ్మెల్యే బీసీ గోవిందప్ప అనుమతులు తీసుకున్నట్లు తెలుస్తోంది. క్వారీలో కంకర కోసం నిత్యం పేలుళ్లు చేస్తుండడంతో తమ పొలాల్లోకి రాళ్లు పడి దూళి చుట్టుకుని పంటలు పండడంలేదని బాధితుడు పలుమార్లు రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో ఇక న్యాయం జరగదని భావించి గురువారం ఉదయం తనకూతురు భారతితో కలిసి క్వారీపైకి ఎక్కాడు. క్వారీ వల్ల తన పంట నాశనం అవుతోందని అందుకు ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టాడు. ఈ వీడియో వైరల్ కావడంతో అధికారులు స్పందించారు. తహశీల్దార్ భాస్కర్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితునితో మాట్లాడారు. అప్పటికే అక్కడికి చేరుకున్న బొమ్మయ్య భార్య భాగ్యమ్మ తన భర్తను సముదాయించి క్వారీ నుంచి కిందకు తీసుకువచ్చింది. తహశీల్దార్ మాట్లాడుతూ క్వారీ విషయమై మైన్స్‌అండ్ జీయాలజీ అధికారులు వివరాలతో రావాలంటూ ఇప్పటికే తెలిజేశామన్నారు. కాగా ఈ విషయమై క్వారీ నిర్వాహకుడు, మాజీ ఎమ్మెల్యే బీసీ గోవిందప్పను వివరణ కోరగా తాము చట్ట ప్రకరమే క్వారీ నిర్వహిస్తున్నామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజకీయ ఐక్య వేదిక నాయకులు

22న పురంలో 'సేవ్ ఆర్‌డిటి' శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిరుపేద కుటుంబాలకు అన్ని విధాలా సహాయ సహకరాలు అందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఎను పునరుద్ధరించాలని కోరుతూ ఈ నెల 22వ తేదీన హిందూపురంలో 'సేవ్ ఆర్డీటీ' పేరుతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు రాజకీయ ఐక్య వేదిక, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. 22న జరిగే ర్యాలీలో ఆర్టీటీ సేవలు పొందిన ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆర్డీటీ పేదలకు విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, సొంతిళ్లు తదితర రంగాల్లో సేవలందించిందని చెప్పారు. ఇలాంటి సంస్థకు ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించకుండా కేంద్రం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించేంత వరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక అధ్యక్షుడు శ్యామ్ కిరణ్, యుటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బీఎస్పీ శ్రీరాములు. ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జైభారత్ భీమ్ రావు పార్టీ నాయకులు నాగరాజు, సమాజ్ వాది పార్టీ తౌసిఫ్, హరికుమార్, నారాయణ, కలీం, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త మృతి

ప్రజాశక్తి-హిందూపురం


శ్రీనివాస మూర్తి(ఫైల్‌ఫొటో)

హిందూపురం పట్టణానికి చెందిన ప్రభాత్ మెడికల్ స్టోర్ యజమాని శ్రీనివాసమూర్తి (73) బెంగళూరులో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. గత నాలుగు నెలల క్రితం పట్టణంలో ఐదు లాంతర్ల సర్కిల్ వద్ద శ్రీనివాసమూర్తి ద్విచక్ర వాహనంపై వెళుతూ ఉండగా ఆవు ద్విచక్ర వాహనంపై దాడి చేసింది. ఈ దాడిలో శ్రీనివాసమూర్తి తీవ్ర గాయాల పాలై నాలుగు నెలల నుంచి చికిత్స పొందుతున్నాడు. చికిత్స నుంచి కోలుకోలేక గురువారం మత్యువాత పడ్డారు. ద్విచక్ర వాహనాల్లో వెళుతున్న వారిపై ఆవులు దాడులు చేస్తున్నప్పటికీ పురపాలక సంఘు అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలాంటి సంఘటనలు సంభవిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై ఆవులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నౌమాన్‌ను సన్మానించిన విజ్ఞాన్ స్కూల్ యాజమాన్యం

'నీట్' విజేత నౌమాన్‌కు సన్మానం

ఓబుళదేవరచెరువు : మండలంలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 1 నుంచి పదో తరగతి వరకూ చదివిన పూర్వ విద్యార్థి నౌమాన్ నీట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించి తిరుపతిలోని బాలాజీ మెడికల్ కళాశాలలో అడ్మిషన్ పొందాడు. దీంతో నౌమాన్‌ను గురువారం విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కరస్పాండెంట్ ఫక్రుద్దీన్, ప్రిన్సిపల్ శ్రీనివాసులు, మల్లికార్జున శాలువాతో సన్మానించారు. విద్యార్థి తల్లిదండ్రులు పొగాకు ముస్తఫా, షబానా మాట్లాడుతూ మా కుమారుడు నీట్‌లో సీటు సాధించడం వెనుక విజ్ఞాన్ పాఠశాల ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉందన్నారు.

పాత్రికేయులకు పోస్టల్ ఇన్సూరెన్స్

లేపాక్షి : మండల పరిధిలో పనిచేసే పాత్రికేయులకు లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ రమానందన్ గురువారం సొంత నిధులతో రూ. 15 లక్షల విలువ చేసే పోస్టల్ బీమాకు మొదటి ప్రీమియం సొమ్ము చెల్లించారు. ఆయన మాట్లాడుతూ పాత్రికేయులు విధి నిర్వహణలో భాగంగా చాలా సమస్యలు ఎదుర్కొంటారన్నారు. అలాంటి వారికి ప్రమాదవశాత్తూ ఏమైనా జరిగితే వారి కుటుంబ సభ్యులకు ఈ బీమా భరోసాగా ఉంటుందన్నారు. దీంతో నా వంతు సాయం చేశానని తెలిపారు. కార్యక్రమంలో పాత్రికేయులు, పోస్టల్ సిబ్బంది రవి, నరసింహులు, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొరికిన మొబైల్ పోలీసులకు అప్పగింత

బత్తలపల్లి : మండలంలోని నల్లబోయనపల్లి గ్రామానికి చెందిన ఆదినారాయణరెడ్డికి రోడ్డుపై ఓ మొబైల్‌ఫోన్ దొరికింది. దీంతో అతడు నిజాయితీగా దానిని గురువారం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దీంతో వివరాలు సేకరించిన ఎఎస్ఐ వెంకటేశులు ముదిగుబ్బకు చెందిన భాగ్యమ్మకు మొబైల్‌ఫోన్ అప్పగించారు. భాగ్యమ్మ హైదరాబాద్‌లో మహిళా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యానిమేటర్‌పై ఫిర్యాదు

గుడిబండ : మహిళా సంఘంలో యానిమేటర్‌గా పని చేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన సురేష్‌పై వెంటనే చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం మండలంలోని పిసి.గిరి గ్రామ మహిళా సంఘం సభ్యులు డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తికి, ఎస్ఐ రాజకుళ్లాయప్పకు వినతి పత్రాలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం మహిళా సంఘంలో యానిమేటర్‌గా పని చేసిన సురేష్ మహిళా సంఘాల సభ్యులకు సంబంధించిన సుమారు రూ. 18 లక్షలు స్వాహా చేసి పరారయ్యాడన్నారు. ఈ విషయంపై గతంలోనే సంబంధిత శాఖ, పోలీస్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇకనైనా సురేష్‌ను అరెస్టు చేసి మా డబ్బులు మాకు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకుడు ఎన్.మంజునాథ్ గ్రామైక్య సంఘం కార్యదర్శి చంద్రకళ, మహిళా సంఘాల ప్రతినిధులు షాతాజబి, పుట్టమ్మ, మహాలక్ష్మి, గంగమ్మ, లక్కమ్మ, భాగ్యమ్మ, గంగమ్మ, శాంతమ్మ, దేవీరమ్మ, సుజాతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీలు పంపిణీ

గోరంట్ల : మంత్రి సవిత సమకూర్చిన స్కూల్ డైరీలను గురువారం టిడిపి నాయకులు మండలంలోని మందలపల్లి సమీపంలో ఉన్న కెజిబివిలో విద్యార్థులకు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా విద్య, సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు అన్ని వసతులతో విద్యనందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ శిరీష, నాయకులు సోమశేఖర్, ఉత్తమరెడ్డి, నరేష్, విద్యాధరణి, పాల్గొన్నారు.



విద్యార్థులకు డైరీలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

పత్తి రైతును ముంచిన ప్రకృతి..!

ప్రజాశక్తి-మడకశిర టౌన్



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు పత్తి పంటను విస్తృతంగా సాగు చేశారు. ఐదు మండలాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్లు తెలుస్తోంది. అయితే అధిక వర్షాల కారణంగా పత్తి పంట బాగా దెబ్బతిని రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. సరిహద్దులోని శిర, పావగడ, మధుగిరి ప్రాంతాల్లో కర్నాటక కంపెనీల నుంచి రైతులు పత్తి విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగు చేస్తున్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, మందులు, కూలీ ఖర్చులను సైతం కంపెనీలే భరించి ప్రోత్సహిస్తున్నాయి. ఎకరా పత్తి పంట సాగుకు దాదాపు రూ. 1.5 లక్షలు ఖర్చు అవుతోంది. రైతులు పండించిన పంటను విత్తన కంపెనీలే కొనుగోలు చేస్తాయి. ఒప్పందం ప్రకారం క్వింటా విత్తనాలకు రూ. 45 వేల ప్రకారం రైతుకు చెల్లిస్తాయి. క్వింటా పత్తికి రూ. 10 నుంచి రూ. 12 వేల వరకూ చెల్లిస్తాయి. ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి వస్తే రైతుకు రూ. 3 నుంచి రూ. 4.5 లక్షలు చేతికి అందుతుంది. కానీ ఈ ఏడాది అధిక వర్షాల వల్ల విత్తన పత్తి మగపువ్వు ఆడపువ్వు క్రాస్ దశలో రైతులు క్రాస్ చేయలేకపోయారు. దీంతో దిగుబడి తగ్గింది. పత్తి కాయ దశలో మళ్లీ వర్షాలు కురవడంతో కాయలోకి నీరు చేరి రంగు మారి అందులోని విత్తనాలు మొలకెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. విత్తనాల్లో నాణ్యత తగ్గడం, పత్తి రంగు మారడం, తదితర కారణాలతో రైతుల తీవ్రంగా నష్టపోయారు. చివరకు పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేక రైతులు దిగాలు చెందుతున్నారు.

పంట పూర్తిగా నష్టపోయా..

రెండు, మూడేళ్ల నుంచి పత్తి పంట సాగు చేస్తున్నా. ఏటా దిగుబడి బాగా వచ్చి గిట్టుబాటు అయ్యేది. ఈ సంవత్సరం అధిక వర్షాల వల్ల పంట పూర్తిగా దెబ్బతింది. దీనికి తోడు కంపెనీలు కూడా ఎకరాకు రెండున్నర క్వింటాళ్లకు ఎక్కువ దిగుబడి వస్తే తీసుకోమని చెబుతున్నారు. దీంతో అధికంగా నష్టపోయాం.

- నారాయణప్ప రైతు, బసవన్నపల్లి.

పెట్టుబడి కూడా వస్తుందో రాదో..

భూమి కౌలుకు తీసుకొని విత్తన పత్తి పంట సాగు చేశా. అధిక వర్షాల వల్ల పంట దెబ్బతినింది. పెట్టుబడి కూడా వస్తుందో రాదో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- వీరేష్, రైతు ఉప్పారపల్లి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్‌భాను తెలిపారు. పట్టణంలోని 5వ వార్డులో వున్న మున్సిపల్ పార్కులో గురువారం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కెఎస్. దిల్షాద్ ఉన్నీసా బహవుద్దీన్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పర్వీన్‌భాను మాట్లాడుతూ రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్ గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు సేగు సుధారాణి బాబయ్య, రాజశేఖర్‌ఆచారి, కౌన్సిలర్లు కిన్నెర కళ్యాణ్‌కుమార్, బండారు మురళి, మహబూబ్‌బాషా, ఉట్టి ఓంప్రకాష్, నాసిర్, షానవాజ్, రాజు, ఇమ్రాన్, పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ పర్వీన్‌భాను, మున్సిపల్ ఛైర్‌పర్సన్, తదితరులు

ఆర్‌డిటి సంస్థ పేదలకు కల్పవృక్షం : ఎమ్మెల్యే



కొత్తచెరువు : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్‌డిటి సంస్థ ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేనివని, తక్షణమే ఎఫ్‌సిఆర్‌ఎను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రెన్యువల్ చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో కోరారు. ఆమె గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ఆర్‌డిటి సంస్థ ప్రజలకు చేస్తున్న సేవల గురించి ప్రస్తావించారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులు రాకుండా నిలిపివేయడం తగదన్నారు. తక్షణమే సిఎం చంద్రబాబు స్పందించి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సిఐటియు నేతపై దాడి చేసిన వారిని శిక్షించాలి : ప్రజాసంఘాలు

ప్రజాశక్తి యంత్రాంగం

బుక్కపట్నం వెలుగు కార్యాలయం ముందు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడికి పాల్పడిన వారిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పుట్టపర్తిలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, సిఐటియు నాయకులు మహబూబ్ బాషా మాట్లాడుతూ వెంకటేష్‌పై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడికి పాల్పడిన వెలుగు సీసీ రవీంద్ర, బుక్ కీపర్ నాగరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని, విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. సోమందేపల్లిలో సిపిఎం మండల కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, నాయకులు వెంకటేశులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, లేనిచో సోమవారం నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ధర్మవరంలో సిఐటియు, చేనేత సంఘం నాయకులు ఎస్‌హెచ్. బాషా, టి.అయూబ్ ఖాన్, వెంకటస్వామి, గుంపు హరి వెంకటేష్ మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, లేనిచో ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. తనకల్లులో సిపిఎం నాయకులు శివన్న, సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు ఒంటెద్దు వేమన్న దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సీసీ రవీంద్రను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఓబుళదేవర చెరువులో ఈఎస్.వెంకటేష్‌పై భౌతికదాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిచో ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాకు దిగుతామని సిపిఎం నాయకులు వివి రమణ, మండల కార్యదర్శి కుళ్లాయప్ప హెచ్చరించారు. కొత్తచెరువులో సిఐటియు మండల కార్యదర్శి ముత్యాలు, నాయకులు శంకర్‌రెడ్డి, బాషా ఈఎస్. వెంకటేష్‌పై జరిగిన దాడిని ఖండించారు. కదిరిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు జిఎల్ నరసింహులు, పట్టణ కార్యదర్శి జగన్మోహన్ మాట్లాడుతూ ఈఎస్.వెంకటేష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పుట్టపర్తిలో సిపిఎం పట్టణ కార్యదర్శి బ్యాళ్ల అంజి మాట్లాడుతూ ఈఎస్.వెంకటేష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని లేకపోతే డిఆర్‌డిఎ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బహుజన చైతన్య వేదిక నాయకులు

రేపు ఆర్‌డిటి పరిరక్షణ ర్యాలీ

ప్రజాశక్తి-పెనుకొండ

ఆర్‌డిటి సంస్థ పరిరక్షణ కోసం ఈ నెల 20వ తేదీ పెనుకొండలో చేపట్టనున్న భారీ ర్యాలీని జయప్రదం చేయాలని బహుజన చైతన్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో గురువారం వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్‌డిటి సంస్థ పేద ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. విద్య, వైద్యం, క్రీడలు, వ్యవసాయం, ఉపాధి అవకాశాలు, జీవనశైలిని మెరుగుపరచడానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎను నిలిపివేయడం దురదృష్టకరమన్నారు. దీంతో ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను వెంటనే రెన్యువల్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బాబు, రవి, రామాంజనేయులు, కొల్లప్ప, అడ్రస్, నరసింహులు, కదిరప్ప, రాజశేఖర్, నరసింహులు బహుజన చైతన్య వేదిక సభ్యులు పాల్గొన్నారు.

నా జీవితం ప్రజాసేవకే అంకితం : పల్లె

ప్రజాశక్తి-కొత్తచెరువు



కొత్తచెరువులో కేక్ కట్ చేస్తున్న పల్లె

నా జీవితం ప్రజాసేవకే అంకితం చేస్తానని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. ఆయన గురువారం తన జన్మదినం సందర్భంగా అనంతపురం నుంచి కొత్తచెరువు రాగా కూటమి పార్టీల శ్రేణులు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను పల్లె కట్ చేశారు. పల్లె మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణ, నాయకులు ఎస్.శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, పివి.శివప్రసాద్, నవీన్ కుమార్, సింగిల్‌విండో అధ్యక్షులు హరిప్రసాద్, నాగేంద్ర ప్రసాద్, వడ్డీ శంకర్, ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

'పల్లె'కు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

పుట్టపర్తి రూరల్ : మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు, బొకేలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంతి గ్రామం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, పలకలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మామిళ్లకుంట క్రాస్ కూడలిలో యువ నాయకుడు బద్రీనాథ్‌చౌదరి, విశ్వనాథ్ ఆధ్వర్యంలో శ్రీసాయి బాలాజీ కళాశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రిలో టిడిపి మండల కన్వీనర్ మైలే శంకర, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, కోట్లో మంజూరెడ్డి ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్డు పంపిణీ చేశారు. బస్టాండ్ సర్కిల్‌లో కేక్ కట్ చేసి పంచి పెట్టారు.

ఆర్డీటీ పరిరక్షణకు ప్రజాఉద్యమం

అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపండి - వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాజకీయాలు, కులమతాలకు అతీతంగా స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ)కి వెంటనే ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యూవల్ చేయాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో ఆర్డీటీ సేవలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, క్రీడారంగాలతో పాటు పేదరికం రూపుమాపేందుకు ప్రభుత్వానికి సమాంతరంగా ఎనలేని కృషి చేస్తోందన్నారు. అలాంటి ఆర్డీటీ సంస్థ కేంద్ర ప్రభుత్వ తీరుతో ఉనికి కోల్పోయే పరిస్థితికి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్డీటీకి మతం బూచి చూపి దేశం నుంచి వెళ్లిపోయేలా విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం బాధాకరమన్నారు. ఆర్డీటీని కాపాడాలని ప్రజా, దళిత సంఘాలు, రాజకీయా పార్టీలు ఆందోళన చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ గతంలో ఆర్డీటీతో చర్చించినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లోగా ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయకపోతే ఆర్డీటీ మూతపడే అవకాశం ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రలో కూడా ఆర్డీటీ ప్రతినిధులను కలిసి సాయం అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చెశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలైనా ఆర్డీటీ గురించి పట్టించుకోలేదన్నారు. ఎన్‌డిఎ కూటమిలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి ప్రధాని మోదీతో మాట్లాడి ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఇకపోతే ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ చాలా దర్మార్గమన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు 17 మెడికల్ కళాశాలలు తీసుకురావడంతోపాటు ఐదింటిని పూర్తి చేసి తరగతులు ప్రారంభించామన్నారు. ఈనేపథ్యంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చి వారి అనుయాయులకు కట్టబెట్టేందుకు మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించేందుకు పూనుకున్నారన్నారు. వీటిని నిరసిస్తూ వైసిపి యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నేడు పెనుకొండలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల వద్ద నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు కాగా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. పెద్దారెడ్డిని వెంటనే తాడిపత్రిలోకి అనుమతించాలని కోరారు.


విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

కలెక్టర్‌కు పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఓ.ఆనంద్‌ను ఉద్యోగ సంఘాల నేతలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం కలెక్టరేట్ ఛాంబర్‌లో ఎపి జెఎసి అమరావతి-అనంతపురం రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నేతలు కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జెఎసి జిల్లా ఛైర్మన్ దివాకర్‌రావు, జనరల్ సెక్రటరీ ఖాన్, అసోసియేట్ ఛైర్మన్ మల్ల రాయుడు, జెఎసి అమరావతి మహిళా విభాగం ఛైర్‌పర్సన్ సురేఖరావు, జనరల్ సెక్రటరీ కృష్ణజ్యోతి, ట్రెజరర్ నీరజా, తదితరులు ఉన్నారు. అలాగే ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఐఎస్సీఎస్టీజిఓడబ్ల్యూఏ) అధ్యక్షులు రవిశంకర్, రాష్ట్ర నాయకులు సుబ్బన్న, సురేష్‌కుమార్ కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వంద శాతం ఎస్సీ ఎస్సీలకే ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలే లక్ష్యం

ఎండి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఆర్టీసీ పని చేస్తోందని ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. గురువారం గుత్తితోపాటు ఉరవకొండ ఆర్టీసీ బస్టాండ్, డిపోలను ఆర్టీసీ సంస్థ ఛైర్మన్ పూల నాగరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కొత్తబస్సుల ఏర్పాటుతో పాటు బస్టాండ్‌లు, ఆర్టీసీ కాంప్లెక్స్‌లను ఆధునీకరిస్తున్నామన్నారు. అనంతరం బస్టాండ్‌లో ప్రయాణికులను కలిసి వారికున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డిఎం హంపన్న, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి బస్టాండ్ తనిఖీ

గుత్తి : గుత్తి బస్టాండ్‌ను ఎపిఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బస్టాండ్‌లోని పరిసరాలతోపాటు డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి, ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనా యాదవ్, సర్పంచి రామలింగమయ్య, తదితరులు బస్టాండ్‌కు నూతన భవనాన్ని నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్ భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. గతంలో భవనం పైకప్పు పెచ్చులు ఊడి పలువురు ప్రయాణికులు గాయపడ్డారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అలాగే బస్టాండులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆర్టీసీ ఎండీ ఆర్టీసీ గుత్తి బస్టాండుకు నూతన భవనాన్ని నిర్మిస్తామన్నారు. భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలను పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


గుత్తిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డెంగీ బాధిత గృహాన్ని పరిశీలించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-గుత్తి

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి ఇబి.దేవి సూచించారు. గురువారం డెంగీ లక్షణాలతో మృతిచెందిన చిన్నారి గృహాన్ని జిల్లా మలేరియా అధికారి ఓబులుతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో వివరాలను సేకరించారు. అనంతరం చెట్నేపల్లిలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్ అమర్నాథ్‌తో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. జ్వరం, దగ్గు జలుబు సోకిన వారికి వైద్య చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటిని ఎక్కువ కాలం నిలువ ఉంచరాదన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. జ్వరం లక్షణాలున్న వారు ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లకుండా ప్రభుత్వాసుపత్రులకు వెళ్లి తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రమ్య, షాషావలి, మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రభాకర్, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.


వివరాలు సేకరిస్తున్న డిఎంహెచ్‌ఒ ఇబి దేవి

జెఎన్‌టియు ఇంటర్ వర్సిటీ పురుష, మహిళల జట్లు ఎంపిక

ప్రజాశక్తి-అనంతపురం

అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో జెఎన్‌టియు ఇంటర్ యునివర్సిటీ పురుషులు, మహిళలు కబడ్డీ జట్టు ఎంపికకు సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ టి.నారాయణరెడ్డి మాట్లాడుతూ అనంతలక్ష్మి కళాశాలకు జెఎన్‌టియు స్పోర్ట్స్ కౌన్సిల్ నిర్ధారించిన విధంగా కబడ్డీ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించే గురుతర బాధ్యతను అప్పగించినట్లు తెలిపారు. అనంతలక్ష్మి కళాశాలకు ఏ కార్యక్రమ నిర్వహణ బాధ్యత అప్పగించినా సమర్థవంతమైన జట్టుకు కావాల్సిన మెరికల్లాటి విద్యార్థులను ఎంపిక చేసి కళాశాల ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలపారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ అనంత రాముడు, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు, వైస్‌ఛైర్మన్ రమేష్‌నాయుడు, నైపుణ్యాభివృద్ధి సంచాలకులు సురేంద్రనాయుడు, ఫిజికల్ డైరెక్టర్లు మల్లికార్జున, ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

శైలజనాథ్‌కు పరామర్శ

శింగనమల : వైరల్ ఫీవర్‌తో హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్‌ను మండల వైసిపి నాయకులు గురువారం పరామర్శించారు. ఇందులో భాగంగా ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యి నియోజకవర్గానికి వస్తారని తెలిపారు. శైలజానాథ్‌ను కలిసిన వారిలో వైసిపి నాయకులు, మాజీ డీలర్ ఆదినారాయణ, జెసిఎస్ మండల కన్వీనర్ రమణ, తదితరులు ఉన్నారు.


శైలజానాథ్‌తో మండల వైసిపి నాయకులు


పోలీసులతో మాట్లాడుతున్న పెద్దారెడ్డి

పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-పుట్లూరు

టిడిపి నేతల దాడిలో గాయపడిన వైసిపి నేత బాబును గురువారం అనంతపురం ఆసుపత్రిలో పరామర్శించిన అనంతరం తాడిపత్రికి బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండల పరిధిలోని ఎ.కొండాపురం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తాడిపత్రికి వెళ్లొద్దని పోలీసులు ఆంక్షలు విధించారు. దీంతో పెద్దారెడ్డి పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అనంతరం ప్రివెంటివ్ అరెస్టు చేసి తిమ్మంపల్లికి తరలించారు.

వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మిద్దె కుళ్లాయప్ప



ప్రజాశక్తి-నార్పల

వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నార్పలకు చెందిన సీనియర్ నాయకులు మిద్దె కుళ్లాయప్పను నియమిస్తూ అధినేత జగన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మిద్దె కుళ్లాయప్ప మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వైసిపి అధ్యక్షులు జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేసాతనని తెలిపారు. పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు కుళ్లాయప్పకు అభినందనలు తెలిపారు.

ఉచిత పశువైద్యశిబిరం

ప్రజాశక్తి-యాడికి

మండల పరిధిలోని కోన ఉప్పలపాడు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పశువులకు గురువారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో పశువులకు 90 శాతం కచ్చితంగా ఆడదూడలు పుట్టే లింగ నిర్ధారిత వీర్యం అందుబాటులో ఉందన్నారు. అనంతరం 47 పశువులకు ఉచితంగా వైద్యంతో పాటు పశువులకు కావాల్సిన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మార్కె రామలక్ష్మమ్మ, టిడిపి సీనియర్ నాయకుడు మార్కె రామాంజనేయులు, ఏడీలు డాక్టర్ ఖదిర్‌బాషా, డాక్టర్ జి.పద్మనాభం, వైద్యులు జె.శ్రీకాంత్, ఎం.సుబ్బారెడ్డి, ఎం.విజయలక్ష్మి, పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-గుత్తి

విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విఆర్‌ఎల సంఘం అధ్యక్షుడు సుధాకర్, నాయకులు చిరంజీవి, నారాయణస్వామి మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా మరణించిన విఆర్‌ఎల కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు రెగ్యులర్ చేయాలన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు, డిఎలను పెంచాలన్నారు. రీ సర్వేలో విధులు నిర్వహించే విఆర్‌ఎలకు టిఎ, డిఎలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు సుధాకర్, జగదీష్, ధన, యుగంధర్, ఆది, తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న విఆర్‌ఎలు

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఇల్లు లేని, గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ డిమాండ్ చేశారు. కదిరి రూరల్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీలో ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకున్న పేదలకు గురువారం సిపిఎం జిల్లా కమిటీ తరపున మద్దతు తెలిపారు. సి.రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు అర్హులందరికీ గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్లు కట్టుకోవడానికి ఇస్తామన్న హామీ ఇచ్చిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలైనా ఇంతవరకు ఇళ్ల స్థలాల గురించి మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. పేదలు కుమ్మర వాండ్లపల్లిలో ప్రభుత్వ భూమి సర్వే నంబర్-720లో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారని, వారందరికీ రెవెన్యూ అధికారులు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిఎల్.నరసింహులు, ప్రాంతీయ కార్యదర్శి జగన్మోహన్, సాంబశివ, రామ్మోహన్, బాబ్‌జాన్, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌పి.కుంటలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం, సిపిఎం నాయకులు

యూరియా కొరతను పరిష్కరించాలి

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రైతులను యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోందని, తక్షణమే ప్రభుత్వం యూరియా సమస్యను పరిష్కరించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎపి రైతు సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ యూరియా కోసం శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు పాసు పుస్తకాలు తీసుకొని రైతు సేవా కేంద్రాలకు వెళ్తే ఎన్ని ఎకరాలు ఉన్నా కేవలం ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తున్నారన్నారు. దీనికి తోడు డిఎపి, ఇతరత్రా ఎరువులు తీసుకోవాలని షరతు పెడుతున్నార న్నారు. సచివాలయం వెళ్తే నానో యూరియా ఇస్తున్నారని, అయితే రైతులకు వాడే విధానం తెలియక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు జిఎల్.నరసింహులు, సాంబశివ, బాబ్‌జాన్, ఉదయ్‌కుమార్, రఫీ, జగన్మోహన్ పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

నంబులపూలకుంట : రైతుల నుంచి బలవంతపు భూసేకరణ ఆపాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కంపెనీల ఏర్పాటు పేరుతో ఇప్పటికే వేలాది ఎకరాల వ్యవసాయ భూములు స్వాధీనం చేసుకుందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 2014లో సోలార్ కంపెనీ పేరుతో 10 వేల ఎకరాలు స్వాధీనం చేసుకుని 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తామని, భూములు ఇచ్చిన కుటుంబాల్లో ఇంటికి ఒక ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అయితే నేటికీ వాటిని అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం మర్రికొమ్మదిన్నె, వంకమద్ది, తాటిమానుగుంత గ్రామాల పరిధిలో 10,500 ఎకరాలు స్వాధీనం చేసుకోవాలని చూడగా అడ్డుకున్నా మని తెలిపారు. రైతులు ఈ కంపెనీల మాయలో పడకుండా తమ భూములపై హక్కులు పొందేం దుకు ఈ నెల 24వ తేదీ విజయవాడలో జరిగే సమావేశానికి అధిక సంఖ్యలో తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జిఎల్.నరసింహులు, కెకె.రాజారెడ్డి, నాగిరెడ్డి, మండల నాయకులు గంగిరెడ్డి, స్వామిరెడ్డి, రమణయ్య, మల్లిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల నిరసన

ప్రజాశక్తి-పెనుకొండ




పుట్టపర్తి తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విఆర్‌ఎలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. విఆర్‌ఎల సంఘం జిల్లా నాయకులు నరసప్ప, అంజనప్ప మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని, ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలు చేపట్టాలని, అక్రమ కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో మండలం లోని విఆర్‌ఎలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు రెండో రోజైన గురువారం కూడా కొనసాగాయి. విఆర్‌ఎలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పే స్కేల్ అమలు చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని, ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తా మని హెచ్చరించారు. వీరి దీక్షలకు సిఐటియు, సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరంలో మండలంలోని విఆర్‌ఎలు, సిఐటియు మండల కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకులు(విఆర్‌ఎ) గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘం నాయ కులు మాట్లాడుతూ పే స్కేల్ అమలు, నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని, అర్హులకు ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలు, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ నెల 20వ తేదీ వద్ద ఆర్‌డిఒ కార్యాలయం, 22వ తేదీ కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామన్నారు. అనంతరం చలో విజయ వాడ కార్యక్రమం చేపడతామని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

కొత్తచెరువు : పోరాటాలతోనే విఆర్‌ఎల సమస్యలు పరిష్కారం అవుతాయని విఆర్‌ఎల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.పెద్దన్న తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దన్న మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి పోరాటాలు చేస్తున్న విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించడంలో పాకులు విఫలమవుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. ధర్నాలో విఆర్‌ఎలు శివప్రసాద్, సాయి, పద్మావతి, నరసింహులు, గంగాద్రి, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



నూతన కలెక్టర్‌ను కలిసిన మాజీ మంత్రి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్యామ్‌ప్రసాద్‌ను గురువారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పల్లె జన్మదినం సందర్భంగా కలెక్టర్ పల్లెకు శాలువా కప్పి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి మీ వంతు సహకారం అందించాలని కోరారు. పల్లె మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి కూటమి నాయకులంతా సహకరిస్తామని తెలిపారు. పల్లె వెంట టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, రమణ, రామారావు, లక్ష్మీపతి, ప్రేమనాథరెడ్డి ఉన్నారు.



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న పల్లె

నేడు, రేపు దస్తావేజులేఖరుల పెన్‌డౌన్

ప్రజాశక్తి-చిలమత్తూరు

రిజిస్ట్రేషన్ శాఖలో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అసిస్టెంట్లు ఈ నెల 19, 20 తేదీల్లో పెన్‌డౌన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం డాక్యుమెంట్ రైటర్లు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సబ్ రిజిస్ట్రార్‌కు సమర్పించారు. డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ ఆధార్, మొబైల్ ఒటిపిలు సరిగా రాకపోవడం వల్ల ఆస్తి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో జాప్యం జరుగుతోందన్నారు.

బుక్కపట్నం : రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలను వ్యతిరేకిస్తూ శుక్ర, శనివారాల్లో పెన్‌డౌన్ ప్రకటించినట్లు దస్తావేజులేఖరుల సంఘం నాయకులు తెలిపారు. నూతనంగా ప్రవేశపెట్టిన ఆధార్ ఒటిపి, ప్రీమియం టు సాఫ్ట్వేర్ వల్ల తలెత్తే సమస్యలను వివరించారు. ప్రభుత్వం ప్రకటించిన కొన్ని విధానాల్లో మార్పు తీసుకురావాలని కోరారు. ఈ క్రమంలోనే జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కూడా పెన్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు, మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు నిరసన తెలిపారు. సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ 12వ పిఆర్‌సి అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, జులై సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు జారీ చేస్తూ, సమ్మె కాలం జీతం వెంటనే చెల్లించాలని, కార్మికుడు మృతి చెందితే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వా లని డిమాండ్ చేశారు. పట్టణం విస్తీర్ణం మేరకు కార్మికుల సంఖ్య పెంచాలని, అవసరమైన పనిముట్లు అందించాలన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేనిచో సమ్మెబాట తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రమణ, రమేష్, రామ్‌దాసు, సురేంద్ర, శివ నాగరాజు, పోతులయ్య, నరసింహులు, నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.



పెనుకొండ నగర పంచాయతీ కార్యాలయం ముందు నిరసన చేపట్టిన కార్మికులు, సిఐటియు నాయకులు

పెనుకొండ : మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు నిరసన నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు మండల కన్వీనర్ బాబావలి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్ మాట్లాడుతూ మున్సిపల్ ఒప్పంద కార్మికులకు 12వ పిఆర్‌సి ప్రకారం వేతనాలు చెల్లించాలని, జులైలో జరిగిన సమ్మె కాలానికి వేతనం చెల్లించాలని, మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు, మహబూబ్‌బాషా, నరసింహ, ఆనంద్, హబీబ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వెంకటేష్, సూరి, వెంకటేష్, నాగమ్మ, నరసమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలపై మున్సిపల్ యూనియన్ సిఐటియు అనుబంధం కదిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు మున్సిపల్ మేనేజర్‌కు డిమాండ్ల తో కూడిన వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, డిఎ బకాయిలు, సరెండర్ లీవ్‌లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు జె.జనార్దన్, కార్యదర్శి ఎస్.తిరుపాల్, సిఐటియు నాయకులు జగన్, సాంబశివ, రఫీ, రామ్మోహన్, కార్మికులు రామాంజి, చెన్నకృష్ణ, సూరి, లక్ష్మన్న, నరసింహామూర్తి, రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాలలను నిర్వహించలేని ప్రభుత్వం

వైసిపి ట్రేడ్ యూనియన్ జాయింట్ సెక్రటరీ కుళ్లాయప్ప

ప్రజాశక్తి-అనంతపురం సిటీ



రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను నిర్వహించలేనంత దిగజారుడుకు కూటమి ప్రభుత్వం వెళ్లడం బాధాకరమని వైసిపి ట్రేడ్ యూనియన్ జాయింట్ సెక్రటరీ పెద్ద హోతూరు కుళ్లాయప్ప అన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ఎన్ని అవాంతరాలు ఎదురైనా విద్య, వైద్యం ప్రభుత్వమే నిర్వహించాలని వైసిపి హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. అయితే నేడు కూటమి ప్రభుత్వం అవాంతరాలను సృష్టించి స్వలాభం కోసం ప్రజా వైద్యాన్ని అమ్మకానికి పెట్టారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమం, ఉపాధి కల్పన వంటి రంగాలను నేరుగా నిర్వహించాల్సిందిపోయి 'పిపిపి' జపం చేయడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో బిజెపి, టిడిపి, టిడిపి, జనసేన కూటమికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇకపోతే శుక్రవారం సత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



కేక్ కోస్తున్న వైసిపి నాయకులు

వైసిపి శ్రేణుల సంబరాలు

శింగనమల : వైసిపి 'స్టేట్ అడ్మిన్ హెడ్'గా ఆలూరు సాంబశివారెడ్డి నియమితులైనందున వైసిపి నాయకులు, కార్యకర్తలు గురువారం సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసం పంచిపెట్టారు. బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొప్పెర్ల నాగవర్ధన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, జెల్లి శ్రీనివాసులుయాదవ్, భాస్కర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, వెంకటరాముడు, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

గుత్తి : మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో ఇటీవల మరణించిన బత్తల రాముడు, బత్తల రాజు కుటుంబ సభ్యులకు గురువారం సూర్యవంశ వడియరాజుల సంఘం అధ్యక్షుడు చిరంజీవి ఆర్థికసాయం చేశారు. గ్రామంలో నాలుగు రోజుల వ్యవధిలో తండ్రి, కుమారుడు మృతిచెందారు. దీంతో సూర్యవంశ వడియ రాజుల సంఘం అధ్యక్షుడు చిరంజీవి, నాయకుడు, టిడిపి పట్టణ కార్యదర్శి బత్తల మారుతీప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు కలిసి గ్రామంలోని మృతుల గృహానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సూర్యవంశ వడియ రాజుల సంఘం గౌరవాధ్యక్షులు హనుమంతు, కార్యదర్శి చంద్ర, కోశాధికారి రాజు, నాయకులు పోతుదొడ్డి రంగనాయకులు, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

యాడికి : ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఎపిఎం చంద్రశేఖర్, నాఫెడ్ సంస్థ రీజినల్ మేనేజర్ లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం మండల పరిధిలోని రాయల చెరువు గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ వార్షిక సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 10వేల రైతు ఉత్పత్తి సంస్థలు ఏర్పాటు చేస్తోందన్నారు. ఇందులో యాడికి మండలం ఒక భాగంగా ఉండటం సంతోషకరమన్నారు. ఈ సంస్థలు రైతుల పంటలను నేరుగా కొనుగోలు చేసి, మధ్యవర్తుల అవసరం లేకుండా మద్దతు ధర కల్పిస్తున్నాయన్నారు. అంతేగాకుండా తూకాల్లో పారదర్శకత ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సంస్థలో రూ.1,100 సభ్యత్వం తీసుకున్న రైతులకు టార్పాలిన్, స్ప్రేయర్లు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు వంటి వస్తువులు రాయితీ ధరలకు లభిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ బోర్డు సభ్యులు మౌలాలి, సిఇఒ సుజాత, సీసీలు సుధాకర్‌రావు, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం : రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో 77ను రద్దు చేయాలని, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన బోధన పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు మైనుద్దీన్, రమణయ్య, యూనివర్సిటీ నాయకులు సాయి, మహేష్, శీనునాయక్, జగదీష్, మహేష్‌బాబు, ఆనంద్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం జిల్లా నాయకులతో జక్కంపూడి రాజా

'అనంత'ను కలిసిన జక్కంపూడి రాజా

ప్రజాశక్తి-అనంతపురం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన 'చలో మెడికల్ కాలేజి' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాన్ని శుక్రవారం జక్కంపూడి రాజాతో పాటు వైసీపీ నేతలు పరిశీలించనున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అనంతపురానికి చేరుకున్న జక్కంపూడి రాజా.. అనంత వెంకటరామిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు జక్కంపూడి రాజాకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తాజా రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు. జక్కంపూడి రాజా వెంట వైసీపీ యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జూ.ఎన్టీఆర్ అసోసియేషన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా సాయిప్రసాద్



నియామకపత్రం అందుకుంటున్న సాయిప్రసాద్

నార్పల : జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అసోసియేషన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా సాయిప్రసాద్ నియమితులయ్యారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో జూనియర్ ఎన్టీఆర్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సాయిరూఫ్ మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా సాయిప్రసాద్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గ బాధ్యతలు అప్పగించినందుకు జూనియర్ ఎన్‌టిఆర్, అసోసియేషన్ రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన ఎపిఎంఎస్ఎఫ్ నాయకుడు చిరంజీవి

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జెన్నే చిరంజీవి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దాసరి సువర్ణరాజుతో కలిసి పూల పుష్పగుచ్చాలు అందజేశారు. దళితులకు ప్రయివేట్ కార్పొరేట్ రంగాల్లో రిజర్వేషన్‌లు అమలు చేసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని, అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్ కలాశాలలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌విజిఎంలో 'స్వచ్ఛత హి'

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, కెవికె ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఇ.చంద్రాయుడు మాట్లాడుతూ మనమందరం స్వచ్ఛందంగా ఇళ్లు, పరిసరాలు, కార్యాలయాలు, కళాశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వచ్ఛతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తర్వాత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కొనంకి శ్రీధర్, జంతుశాస్త్ర విభాగం ఇన్‌ఛార్జి చాముండేశ్వరి, కెవికె శాస్త్రవేత్తలు బాలాజీ, హరిణి, శిరీషా, అధ్యాపకులు చక్రవర్తి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు

డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం

జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో "డగ్స్ వద్దు బ్రో, ట్రాఫిక్‌లో ద్విచక్ర వాహనంపై త్రిబుల్ రైడింగ్, హెల్మెట్ ధారణ, సైబర్ నేరాల'పై సురక్ష వాహనం ద్వారా వీడియో రూపంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు టి.విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ పంపిన మొబైల్ వ్యాన్ వీడియోల దృశ్యాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, ఫోన్‌లోని వివిధ యాప్‌లను ఓపెన్ చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు పి.నగేష్, కె.వీరేష్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సాయంత్రం ప్రధాన కూడలిలో..

పట్టణంలోని వినాయక కూడలిలో గురువారం సాయంత్రం సురక్ష వాహనం ద్వారా వీడియో ప్రదర్శన చేశారు. ఇందులో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, బాల్య వివాహాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం మొదలైన అంశాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-నార్పల

ఐసిడిఎస్ సిడిపిఒ భారతి ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని ఉయ్యాలకుంట-4, చైతన్య కాలనీ అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ డివి నారాయణమ్మ పిల్లలో ఊబకాయంపై వివరించారు. ముఖ్యంగా జంక్ పుడ్స్ స్వీట్స్ తినడం, సాఫ్ట్ డ్రింక్స్ తాగడం, శారీరక శ్రమ లేకపోవడం, టీవీ మొబైల్ ఎక్కువగా చూడటం వల్ల ఊబకాయం వస్తుందన్నారు. రాకుండా ఉండడానికి మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. ముఖ్యంగా కూరగాయలు తీసుకోవాలని, రోజూ సైకిల్, స్లిప్పింగ్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగిని నాగేశ్వరి, ఆశావర్కర్ మంజుల, వెంకటలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు కె.నాగమణి, డి.శ్రీదేవి, జరీనాబేగం, తదితరులు పాల్గొన్నారు.



నార్పలలో వివరిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ

పెద్దవడుగూరు : చిన్నారుల్లో ఊబకాయం రాకుండా నివారించేలా చూడాలని ఐసీడిఎస్ సూపర్వైజర్లు నాగేశ్వరి, వెంకటలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని కాశేపల్లి, చింతలచెరువు గ్రామాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పిల్లల్లో ఊబకాయంపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

ఆసియాభానును స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

విద్యార్థిని ఆసియా భానును స్ఫూర్తిగా తీసుకోవాలని కెటిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆసియా భాను బీఎస్సీ ద్వితీయ సంవత్సరం (భౌతిక శాస్త్రం) విద్యను అభ్యసిస్తోంది. ఎన్‌సిసి క్యాడేట్ ఆసియా భాను ఆల్ ఇండియా తల సైనిక్ క్యాంపునకు ఎంపికై ఢిల్లీలో శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఇంటి నుంచి బయటకు పంపడమే గగనమైన వారింట విద్యార్థిని కృషిని గుర్తించిన తల్లిదండ్రులు ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. విద్యార్థిని, తల్లిదండ్రులను ఘనంగా సన్మానించి సత్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ రాయదుర్గం చాలా మారుమూల ప్రాంతమైనప్పటికీ ఈ ప్రాంత విద్యార్థులు చాలా విషయాల్లో ముందుంటారని ఆసియా భాను నిరూపించిందన్నారు. ఆసియా భానును స్ఫూర్తిగా తీసుకుని ఎన్‌సిసి క్యాడేట్లు మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత సమన్వయకర్త ఫరిసా ఫిర్దోస్, ఎన్‌సిసి సిటిఒ బాల నరసింహులు, అధ్యాపక బృందం, ఎన్‌సిసి క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆసియా భాను, తల్లిదండ్రులను సన్మానిస్తున్న అధ్యాపకులు

సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు నోచని కాలనీలు..!

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని పలు కాలనీలు, వీధులు నేటికీ సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాలువలకు నోచు కోలేదు. చాలా వీధుల్లో మట్టి రోడ్లు పైగా గుంతలతో ఎగుడు, దిగుడుగా ఉన్నాయి. దీంతో ప్రజలు, వాహనాల రాకపోక లకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇక చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు, వీధులు బురదమయం అవుతాయి. దీంతో పాదచారులు, వాహనదారులు రోడ్డుపైకి వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా వర్షం కురిస్తే పట్టణంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో రాజీవ్ గాంధీ కాలనీ, మధుటాకీస్, దుగ్గులమ్మ గుడి వీధి ఉంటాయి. ఆయా కాలనీలు పల్లపు ప్రాంతాలు కావడంతో వర్షం నీరు ముందుకు వెళ్లే అవకాశం లేక రోడ్డుపైనే గుంతల్లో నిలిచి బురదమయం అవుతాయి. దీంతో వర్షం వచ్చిన ప్రతిసారి ఆయా కాలనీల వాసులు వీధిలో అడుగు పెట్టాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. భంభంస్వామి ఆశ్రమం నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారి మట్టి రోడ్డు కావడం, గుంతలుగా ఉండటం వల్ల వర్షం కురిస్తే నీరు నిలిచి ఉండటం, బురద గా మారి పాదచారులు, వాహన చోదకులు ఈ మార్గంలో వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. కొండ దిగువన గల సిద్దేశ్వరకాలనీ, అయ్యప్ప స్వామి గుడి రోడ్డు, మోడల్ కాలనీ మెయిన్ రోడ్డు, తదితర చోట్ల కూడా ఇదే పరిస్థితి ఉంది. కనీసం ప్రధాన రహదారుల్లోనైనా తారు రోడ్డు లేక సిమెంట్ రోడ్లు వేయాలని, లేదా మట్టి రోడ్డులో కనీసం గుంతలైనా పూడ్చాలని, ఇరువైపులా డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మున్సిపల్ అధికారులు, పాలక మండలి ప్రతినిధులు ఆయా కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చినుకు పడితే బురదమయమవుతున్న దారులు



సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో బురదమయమైన రహదారులు

డెంగీ లక్షణాలతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న షేక్ మహమ్మద్ షాహిద్ (13) డెంగీ లక్షణాలతో మృతి చెందినట్లు హెచ్ఎం రాఘవ తెలిపారు. విద్యార్థి తండ్రి బాబ్‌జాన్ మాట్లాడుతూ స్థానిక గేట్ కొట్టాలలో నివాసం ఉంటూ చేతి వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్నామన్నారు. తమ కొడుకు షాహిద్ నెల రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడని, వైద్యం చేయించినా నయం కాలేదని వాపోయాడు. ఉపాధ్యాయులు విద్యార్థి మృతికి నివాళులర్పించారు.



షాహిత్(ఫైల్‌ఫొటో)

రైతులకు యూరియా అందజేత

ప్రజాశక్తి-నల్లమాడ

మండలంలోని దొన్నికోట, కురుమాల గ్రామాల్లో గురువారం రైతులకు టోకెన్ పద్ధతిలో యూరియా పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ హక్ తెలిపారు. రైతులు ఈ నెల 30వ తేదీ లోగా ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో తెలిపారు. కార్యక్రమంలో విహెచ్ఎలు, ఎంపిఇఒలు ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండలంలోని మేకలచెరువు, మర్రికొమ్మదిన్నె గ్రామ రైతు సేవా కేంద్రాల్లో తహశీల్దార్ దేవేందర్‌నాయక్, వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డి 280 మంది రైతులకు 560 బస్తాల యూరియా పంపిణీ చేశారు. అలాగే వారు నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. మర్రికొమ్మదిన్నె ఆర్ఎస్‌కెలో కెపి.అంజనప్పనాయుడు మాట్లాడుతూ మండలంలో ఎక్కడా కొరత లేకుండా 150 మెట్రిక్ టన్నుల యూరియా తెప్పించి రైతులకు సరఫరా చేశారని వ్యవసాయ అధికారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది నరసింహారెడ్డి, కార్తీక్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



నల్లమాడలో రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏవో

నేడు యూరియా పంపిణీ

ముదిగుబ్బ : మండలంలోని మార్తాడు గ్రామంలో శుక్రవారం యూరియా పంపిణీ చేస్తామని ఎఇఒ గౌతమ్ తెలిపారు. ఈ పంచాయతీకి 280 బ్యాగులు కేటాయించారన్నారు. ఒక రైతుకు ఒకటి లేదా రెండు బ్యాగులు ఇస్తామని, అవసరమైన రైతులు తీసుకెళ్లాలని సూచించారు. అలాగే వేరుశనగ, కంది, తదితర పంటలు సాగు చేసిన రైతులు నెలాఖరు లోపు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని తెలిపారు.

'చలో మెడికల్ కాలేజీ'కి యువత తరలిరావాలి

వైసిపి విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు కె.చైతన్యరెడ్డి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి యువజన విభాగం, విద్యార్థి విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్న చలో మెడికల్ కాలేజీ కార్యక్రమానికి యువత పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ పార్టీ విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు కె.చైతన్యరెడ్డి కోరారు. బత్తలపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో అన్ని విద్యార్థి, కుల సంఘాలను కలుపుకొని రాబోయే కాలంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

టీకాతో గాలికుంటు వ్యాధి నివారణ

ప్రజాశక్తి-బత్తలపల్లి

టీకాతో పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధిని నివారించవచ్చని మండల పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి తెలిపారు. మండలంలోని యర్రాయపల్లి గ్రామంలో గురువారం 275 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేశారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 15వ తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని 4 నెలలు వయస్సు పైబడిన అన్ని పశువులకు టీకా వేయించాలన్నారు. ఈ టీకా వేసిన పశువుల్లో మొదటి రెండు, మూడు రోజులు పాలదిగుబడి తగ్గి మళ్లీ పెరుగుతుందని, రైతులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మండల ఆర్ఎస్కే సిబ్బంది, ఏహెచ్‌లు, గోపాలమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న వైద్యులు





సమావేశంలో పాల్గొన్న దస్తావేజులేఖరులు

దస్తావేజులేఖరుల నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని దస్తావేజులేఖరులు, వారి సహాయకుల ఆధ్వర్యంలో గురువారం నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కృష్ణాపురం జావిద్‌బాషా, ఉపాధ్యక్షులుగా బారు భాస్కర్, కార్యదర్శిగా జూటూరు మహేంద్ర, సహకార్యదర్శిగా తొండమాల నాగార్జున, కోశాధికారిగా సింగేటి మల్లికార్జునను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులు జావిద్‌బాషా మాట్లాడుతూ దస్తావేజులేఖరుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామన్నారు. సహాయకులకు చేదోడు వాదోడుగా ఉంటూ వారికి వృత్తి పట్ల ఏ సమస్య ఉన్నా సలహాలు సూచనలు ఇస్తామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ దస్తావేజులేఖరులు అల్లం రామాంజి, బాలాజీ, వాజిద్, గోపి, కామనూరు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని జగరాజుపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన కంది పంటను గురువారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. రైతులకు యాజమాన్య పద్ధతులను వివరించారు. అలాగే పురుగు మందులను సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య, ఎఇఒ ఆనంద్‌నాయక్, విఎఎ సూర్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.



కళాశాల ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శ్రమ దానం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్ మాట్లా డుతూ వర్షాకాల పరిస్థితులు దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే కళాశాలలో పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సూచిం చారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరీష్‌బాబు, అధ్యాపకులు రామన్న, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీ.. కేసు నమోదు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

మండలంలోని మల్లయ్యగారిపల్లికి చెందిన అశోక్‌కుమార్‌రెడ్డి తన సెల్‌ఫోన్ చోరీకి గురైందని ఫిర్యాదు చేయడంతో పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. దీంతో సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు అశోక్ టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఉన్న మారుతి కాఫీ పొడి సెంటర్‌లో కాపీ పొడి తీసుకొనే క్రమంలో సెల్‌ఫోన్‌ను పక్కన ఉంచగా అక్కడే ఉన్న ఓ వ్యక్తి చోరీ చేసినట్లు గుర్తించారు. ఆ వ్యక్తి గురించి ఆచూకీ తెలిసినా లేదా గుర్తుపట్టిన వారు సిఐ 94407 96851కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి-నల్లచెరువు

స్థానిక పిహెచ్‌సిలో పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో గురువారం నిర్వహించిన 'స్వస్థ్ నారీ-సశక్త్ పరివారం అభియాన్ కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ ఫైరోజ్ బేగం తనిఖీ చేశారు. ఆమె వివిధ రిజిస్టర్‌లను పరిశీలించారు. అలాగే అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటుచేసిన పోషకాహార స్టాల్‌ను సందర్శించారు. ఆమె వెంట కదిరి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేంద్ర, నల్లచెరువు వైద్యాధికారులు డాక్టర్ అలేఖ్య, డాక్టర్ కల్పన, సిహెచ్‌ఒలు వన్నప్ప, రామచంద్రారెడ్డి, సూపర్వైజర్స్ సుధాకర్, రెడ్డమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ జయమ్మ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఆకుకూరలతో ప్రయోజనం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని సోమిరెడ్డిపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి మహిళలకు పౌష్టికాహారం, పరిశుభ్రత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా పిల్లలకు ఊబకాయం రాకుండా జాగ్రత్తలను సూచించారు. చక్కెర, నూనె పదార్థాలను తక్కువగా తీసుకోవాలని, మంచి ఆకుకూరలు తింటే పిల్లలకు ఊబకాయం రాదన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది రత్నమ్మ, శైలజ, సుజాత, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక శాఖా గ్రంథాలయాన్ని గురువారం ఉమ్మడి అనంతపురం జిల్లా గ్రంథాలయం కార్యదర్శి పి.రమ సందర్శించారు. రికార్డులను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ నుంచి గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ బకాయలను జమ చేయించాలని తెలిపారు. గ్రంథాలయ సభ్యత్వం పెంచాలని గ్రంథాలయ అధికారి నాగరాజును ఆదేశించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న కార్యదర్శి రమ

బార్ల కేటాయింపునకు లాటరీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నూతన బార్ పాలసీలో భాగంగా రెండవ దఫా రీ నోటిఫికేషన్ మేరకు 9 బార్లకు నోటిఫికేషన్ ఇవ్వగా రెండు బార్లకు సంబంధించి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. కళ్యాణదుర్గం, గుత్తిలో రెండు బార్లకు ఎంపికకును లాటరీ పద్ధతిలో అనంతపురం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. కలెక్టర్ ఓ.ఆనంద్ ఆధ్వర్యంలో పారదర్శకంగా దరఖాస్తుదారుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. లాటరీ పద్ధతిలో ఎంపికైన వారికి మంజూరు పత్రాన్ని కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామమోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'

గుత్తి : కుటుంబం శక్తివంతంగా ఉండేందుకు ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారులు ప్రవీణ్ కుమార్, దేవేంద్రనాయక్‌లు తెలియజేశారు. మండలంలోని మాముదూరు గ్రామంలో గురువారం స్వస్థ్ నారీ-స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మహిళలకు రక్తపోటు, మధుమేహం,నోటి క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, క్షయ వ్యాధి, మానసిక రోగాలపై పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సుధారాణి, వైద్య,ఆరోగ్య సిబ్బంది ఆంజనేయులు, సరస్వతి, సుధారాణి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బెలుగుప్ప : గర్భవతులు పుట్టబోయే బిడ్డకు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ కార్తీక్ కుమార్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి. వెంకటరమణ ఎఎన్ఎంలు రాధమ్మ, జనసేన మండల అధ్యక్షులు సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని గజరాంపల్లి గ్రామంలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎద్దులపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఇబి.దేవి ఈ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. మహిళలు క్రమం తప్పకుండా వైద్య చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, త్యాగరాజ్ , గంగాధర్, సుధాకర్, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని దుగుమర్రి సచివాలయంలో మహిళలకు ఉచిత వైద్యపరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి శివలక్ష్మి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్యులు డాక్టర్ సునీత పలు వ్యాధుల పై అవగాహన కల్పించారు.

యాడికి : మండలంలోని కమలపాడు గ్రామంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, వైద్యులు పరమేశ్వర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ జుబేదా, సూపర్ వైజర్లు రాంప్రసాద్ గౌడ్, శోభ కుమారి, ఎఎన్ఎం జీనత్, రాజామణి ఎంఎల్‌హెచ్‌పి భాగ్యలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

పేకాట జూదరులు అరెస్టు.. నగదు స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం రూరల్

పేకాట జూదరులను అరెస్టు వారి నుంచి నగదు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ ఆంజనేయులు, టూటౌన్ సిఐ అబ్దుల్‌కరీం తెలిపారు. వివరాలు.. అందిన సమాచారం మేరకు ఇద్దరు సిఐలు పోలీసులతో కలిసి దాడులు చేశారు. రూరల్ మండల పరిధిలోని మనసముద్రం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 15,080 నగదు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు సిఐ ఆంజనేయులు తెలిపారు

చిలమత్తూరు : మండలంలోని వీరాపురం క్రాస్ సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 10,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న పథకాలను క్షేత్రస్థాయిలో రైతులకు చేరవేసే విధంగా విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా పంపిణీకి సంబంధించి అవసరం ఉన్న చోట తప్పకుండా సరఫరా చేసి పంపిణీ చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఈకేవైసీ, ఎన్‌పీసీఐ లింక్ పెండింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖలలో అమలవుతున్న పథకాలను రైతులకు చేరవేసే విధంగా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో మొక్కజొన్న, వేరుశనగ, తదితర పంటలు కోత దశలో ఉన్నాయని, వాటి ప్రస్తుత మార్కెట్ ధరలను గమనిస్తూ సీఎం యాప్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ నమోదు చేసేలా పర్యవేక్షించాలని మార్కెటింగ్ ఏడీని ఆదేశించారు. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడిహెచ్) కింద పెండింగ్ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఆయిల్ పామ్ తోటల సాగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వీలైనంత వరకు ఒకే గ్రామంలో ఎక్కువ ఆయిల్ పామ్ తోటల సాగు చేయించాలన్నారు. సెరికల్చర్ శాఖకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో 58 పిఏసిఎస్‌లకు సీడ్ లైసెన్స్, ఫర్టిలైజర్స్ లైసెన్స్ ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి ఐదు చొప్పున అగ్రిటెక్ స్టార్టప్‌లను గుర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, మార్క్‌ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, మార్కెటింగ్ ఏడీ రాఘవేంద్ర కుమార్, డిసిఒ అరుణ కుమారి, సెరికల్చర్ ఏడీ విజయ్ కుమార్ పాల్గొన్నారు



కలెక్టర్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు

ఆలయ కమిటీ ప్రతినిధులకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పేట వెంకటరమణ స్వామి దేవాలయం నూతన కమిటీ ప్రతినిధులను మహర్షి వాల్మీకి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఇటీవల పేట వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులుగా భగీరథ నవీన్‌తో పాటు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో మహర్షి వాల్మీకి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ తదితర సభ్యులను సన్మానించి దేవాలయ పురోభివృద్ధికి అన్ని విధాలా కృషి చేయాలని కోరారు.



ఆలయ కమిటీ ప్రతినిధులను సన్మానిస్తున్న వాల్మీకి ఆలయ కమిటీ సభ్యులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

పులమతి రోడ్డు, లక్ష్మీపురం వార్డు పర్యటనలో చైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ డి.ఈ.రమేష్ కుమార్ పేర్కొన్నారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం మున్సిపల్ పరిధిలోని పులమతి రోడ్డు, లక్ష్మీపురంలో అధికారులతో పాటు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త పావులూరి శ్రీనివాస్ రావుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు పులమతి రోడ్డు, లక్ష్మీపురం వీధుల్లో రహదారులు, పారిశుధ్య, వీధి దీపాలు, నీటి సమస్య తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే నూతనంగా రహదారులు ఏర్పాటు చేయడంతో పాటు మురికి కాలువలను నిర్మిస్తామన్నారు. నీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించి, అవసరమైన అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, కౌన్సిలర్ దుర్గా మంజుల, టీడీపీ నాయకులు దుర్గా నవీన్, లింగప్ప, ఐటిడిపి శ్రీనివాసులు, సునీల్, టైలర్ గంగాధర్, దుర్గా నాని, మల్లికార్జున, రఫీక్, శివ గోవింద, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మినీ మార్కెట్‌ను పరిశీలిస్తున్న చైర్మన్, తదితరులు

బాలయ్య చొరవతో 'పురం' సమగ్రాభివృద్ధి

టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-హిందూపురం

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని హిందూపురం నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. హిందూపురం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ముందుకెళ్తున్నట్లు వివరించారు. హిందూపురం పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 92.50 నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం నుంచి జీవో వచ్చిందన్నారు. పట్టుగూళ్ల మార్కెట్ నిర్మాణం కోసం రూ. 8 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. పురపాలక సంఘంలో ప్రతి ఇంటికీ ప్రతిరోజూ నీళ్లు అందించాలనే సంకల్పంతో నూతన పైప్ లైన్ నిర్మాణం కోసం రూ.126 కోట్ల నిధులు కావాలని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామన్నారు. ఈ నిధులు త్వరలో మంజూరు అవుతాయన్నారు. రానున్న మూడేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో బాలకృష్ణ ముందుకెళ్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు అమీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస రావు

సన్మానించిన రీలర్లు....

పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న పట్టుగూళ్ల మార్కెట్ స్థానంలో నూతన మార్కెట్ నిర్మాణం కోసం రూ.8 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పట్టు రీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులను రీలర్లు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముస్తఫా, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

పురంలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-హిందూపురం

వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానస్పద వ్యక్తుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ రాజగోపాల్ నాయుడు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సూచనల మేరకు డీఎస్పీ మహేష్ పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. గంజాయి విక్రయాలు, అక్రమ మద్యం, జూదం తదితర అసాంఘిక కార్యక్రమాలు జరిగితే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణ ప్రజలకు సూచనలు ఇస్తున్న వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు



వారోత్సవాల్లో పాల్గొన్న అతిథులు

వివిధ శాఖల పనితీరుపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న అధికారులు తమ పని తీరును మెరుగుపర్చుకుని సత్ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు. తొలుత పరిశ్రమల శాఖ అధికారులతోకలెక్టర్ సమీక్షిస్తూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు అన్ని రకాలుగా అధికారులు ప్రోత్సహించాలని ఆదేశించారు. ముఖ్యంగా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పన భారీ పరిశ్రమలు కొరకు స్థల సేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసే క్రమంలో అనుబంధ శాఖల అధికారులు సమన్వయం సహకారాలతో కృషి చేయాలన్నారు. ఎమ్మెస్ ఎంఇ సర్వేలో భాగంగా అన్ని యూనిట్ల కు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయించాలని, నూతన క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం నెడ్క్యాప్ ద్వారా ప్రతిపాదిత పరిశ్రమల గురించి చర్చించారు. అలాగే సోలార్ ప్లాంట్లో ఏర్పాటు వివరాలు, పరిశ్రమల్లో కాలుష్య నివారణ, అగ్ని ప్రమాదాల నివారణ కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీఐఐసీ అధికారులతో సమీక్షిస్తూ ప్రభుత్వ భూములను గుర్తించి ఎంఎస్ఎంఇల స్థాపన కోసం భూసేకరణ పనులు పూర్తి చేయాలని ఇప్పటికే శంకుస్థాపన జరిగిన పార్కులలో పెండింగ్ లో ఉన్న మౌలిక వసతుల కల్పన పనులను త్వరత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులతో సమీక్షిస్తూ నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం అమలుగురించి అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ఇంతవరకు మంజూరైన నిధుల వివరాలపై ఆరాతీశారు. అలాగే జిల్లా ప్రధాన కేంద్రంలో కాలుష్య నియంత్రణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గనులు భూగర్భ జల శాఖ, జిల్లా ఖనిజ నిధుల వినియోగంపై కలెక్టర్ ఆరా తీశారు. అలాగే ఇసుక లభ్యతపై సమీక్షించారు. ఈ సందర్భంగా కొత్త గనుల మంజూరు విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో కొత్త ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన క్లియరెన్నను వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యావరణ శాఖ ద్వారా త్వరితగతిన ఎన్ఓసీలను పొందాలన్నారు. జిల్లా కార్మిక శాఖ, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అగ్నిమాపకం, విపత్తు, డ్వామా, డిఆర్డిఎ, మెప్మా, మున్సిపల్, పిజిఆర్ఎస్ విభాగం తదితర శాఖల అధికారులతో వేర్వేరుగా కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌యాదవ్, జిల్లా గనుల శాఖ అధికారి ఆదినారాయణ, పొల్యూషన్ బోర్డ్ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా అగ్నిమాపక విపత్తు శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్డిఎ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీంబాషా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండాలి

ప్రజాశక్తి-శింగనమల

కుటుంబం శక్తివంతంగా ఉండేందుకు ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారులు అన్నారు. మండలంలోని మండల పరిధిలోని శోదనపల్లి గ్రామంలో గురువారం స్వస్త్ నారీ-శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్. క్షయ వ్యాధి, మానసిక రోగాలపై పరీక్షలు చేశారు. మహిళలలో అసంక్రమిత వ్యాధుల నివారణకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శంకర్ నాయక్, డాక్టర్ తెజేశ్విని, డాక్టర్ కృష్ణవేణి, ఎఎన్ఎం నాగవేణి, మౌనిక, అంగన్వాడీ టీచర్లు టి.రత్నమ్మ, బి.సరస్వతి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి-శింగనమల

ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందించడమే కూటమిప్రభుత్వ లక్ష్యమనిర వీఆర్వో తాతయ్య అన్నారు, గురువారం మండల కేంద్రంలోని పరిధి బోయవీధిలో ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అతి చేరువగా ప్రజా పంపిణీ సులభతరం చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించిందన్నారు. వీటి వల్ల సులువుగా రేషన్ తీసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో స్టోర్‌డీలర్ కాయగూరల సత్యనారాయణ, నన్నేబాషా, ఆటోబాషా, జడేజా సచివాలయ సిబ్బంది, వీఆర్వో, స్టోర్ డీలర్ శివ యాదవ్, షర్మాస్ తదితరులు పాల్గొన్నారు

కలెక్టర్ వినోద్‌కుమార్ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


అనంతపురం కలెక్టర్‌గా వినోద్‌కుమార్ సేవలు ఎనలేనివని వక్తలు కొనియాడారు. గురువారం రాత్రి అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో వినోద్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ముందుగా వినో కుమార్ మాట్లాడుతూ తన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి వచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. నూతన జిల్లా కలెక్టర్ తో ఉన్న అనుబంధంను గుర్తు చేసుకున్నారు. అనంతపురం జిల్లా కలెక్టర్ గా పనిచేయడం జీవితంలో మరచిపోలేనిదన్నారు. ఇక్కడ పనిచేసిన సమయంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలిపారు. ఇక్కడి నుంచి ఎంతో విలువైన జ్ఞాపకాలను తీసుకుని వెళుతున్నామన్నారు. కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన కలెక్టర్ వినోద్‌కుమార్‌తో తనకు 8 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. ఆయన నుంచి చాలా నేర్చుకోవడానికి అవకాశం దొరికిందన్నారు. జిల్లాకు ఆయన చేసిన సేవలు, కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డిఆర్ఓ ఏ.మలోల మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన కలెక్టర్ జిల్లాకు చేసిన సేవలు మరచిపోలేనివన్నారు. జిల్లాలో అనేక ప్రభుత్వ అభివద్ధి, సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేశారని, ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని, ఎన్నో కార్యక్రమాలు చేసి అందరి మన్ననలు పొందారన్నారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓ, ఆర్డీఓలు, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి, పలువురు జిల్లా అధికారులు బదిలీపై వెళ్లిన జిల్లా కలెక్టర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జున, ఆనంద్, మల్లికార్జునరెడ్డి, సిపిఓ ఆశోక్‌కుమార్, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, హౌసింగ్ పీడీ శైలజ, ఎపిఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రిశేఖర్, డిఆర్డిఎ పీడీ శైలజ, డిఐపిఆర్ఓ బాలకొండయ్య, నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఎపిఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, డిఎంహెచ్ఓ ఇబి.దేవి, ఐసిడిఎస్ పీడీ నాగమణి, హౌసింగ్ పిడి శైలజ, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూకొఠారి, ఆర్అండ్‌బి ఎస్ఇ మురళీకృష్ణ, జిల్లా రిజిస్టర్ భార్గవ్, డివిఈఓ వెంకటరమణ నాయక్, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, డీపీఓ నాగరాజునాయుడు, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, డిఈఓ ప్రసాద్ బాబు, డిసిఓ అరుణకుమారి, డిస్టిక్ మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి కోఆర్డినేటర్ డా.బి.ఎన్ శ్రీదేవి, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, కలెక్టరేట్ సెక్షన్ ల సూపరింటెండెంట్లు యుగేశ్వరిదేవి, రియాజుద్దీన్, తహసీల్దార్ హరికుమార్, పలువురు తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.లి

వీడ్కోలు సభలో పలువురు అధికారులు



వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడుతున్న పూర్వపు కలెక్టర్ వినోద్‌కుమార్


ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
వాస్తవాలను వెలుగులోకి తెస్తూ
ప్రజల ప్రశంసలను
అందుకున్న ప్రజాశక్తి దినపత్రిక
45వ వార్షికోత్సవం
సందర్భంగా మంత్రి శ్రీమతి సవిత గారికి,
పెనుకొండ నియోజకవర్గం ప్రజలకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
తెలుపుతూ
మీ...
ఎస్.జబీవుల్లా
కాంట్రాక్టర్, పెనుకొండ


ప్రజాశక్తి దినపత్రికకు
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రజాశక్తి 45వవార్షికోత్సవ
సందర్భంగా
మండలంలోని,
అధికారులకు,
నాయకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
ప్రజాశక్తి సిబ్బందికి
"హృదయపూర్వక శుభాకాంక్షలు"
జాన్ రెడ్డప్ప
ఎమ్.ఈ.ఓ-1, గోరంట్ల
గోపాల్
ఎమ్.ఈ.ఓ-2, గోరంట్ల


ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే
నినాదంతో ప్రజల సమస్యలపరిష్కారం
కోసం వెలువడుతున్న
ప్రజాశక్తి దినపత్రికకు
45వ వార్షికోత్సవం శుభాకాంక్షలు
తెలుపుతూ....
మీ శ్రేయోభిలాషి,
పామిడి మండలం


ప్రజాశక్తికి 45వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
44 సంవత్సరాలు దిగ్విజయంగా
పూర్తి చేసుకొని
45వ వార్షికోత్సవం
జరుపుకుంటున్న ప్రజాశక్తి
పాఠకులకు, అభిమానులకు, ప్రజలకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
తెలుపుతూ
స్వాతి
తహసిల్దార్, పెనుకొండ
మీ...
శ్రీనివాసరావు
మండల సర్వేయర్, పెనుకొండ


ప్రజాశక్తి దినపత్రికకు
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మండలంలోని, అధికారులకు,
నాయకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
ప్రజాశక్తి 45వవార్షికోత్సవ
సందర్భంగా
"హృదయపూర్వక శుభాకాంక్షలు"
గణేష్
హౌసింగ్ ఏ.ఇ,
గోరంట్ల
మల్లికార్జున
హౌసింగ్ వర్క్ఇన్స్పెక్టర్,
గోరంట్ల


ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతిక్షణం ప్రజలసమస్యలపై స్పందిస్తూ
ఆర్థిక, శ్రామిక వర్గ
ప్రజల పక్షపాతిగా ముందుకు
సాగుతూ 45వ వసంతంలోకి
అడుగు పెడుతున్న ప్రజాశక్తి దినపత్రికకు
హృదయపూర్వక శుభాకాంక్షలు
తెలుపుతూ
మీ...
డాక్టర్ మోహన్ నాయక్
సూపర్ ఇండెంట్
ప్రభుత్వ వైద్యశాల,
పెనుకొండ


ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...
ప్రతి అక్షరం ప్రజల పక్షం అనే నినాదంతో పేద ప్రజల
గుండెచప్పుడును వినిపిస్తూ నిజాలను నిర్భయంగా రాస్తున్న
ప్రజాశక్తి దినపత్రిక 45వ వార్షికోత్సవం సందర్భంగా
ప్రజలకు, రైతులకు, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు,
పత్రికా విలేకరులకు, యాజమాన్యానికి హృదయపూర్వక
శుభాకాంక్షలు...
అక్రమ మద్యం రవాణా అమ్మకం చట్టరిత్యా నేరం
గంజాయి వాడొద్దు.. జీవితాలు నాశనం చేసుకోవద్దు
కల్లు గీత కార్మిక సంఘం
పెనుకొండ


ప్రజా కార్మిక రైతాంగ ప్రజల సమస్యల పరిష్కారామే లక్ష్యంగ
45వ వార్షికోత్సవంలోకి అడుగు పెట్టిన
ప్రజాశక్తి దినపత్రికకి
పరిగి మండల ప్రజల తరుపున
"హృదయపూర్వక శుభాకాంక్షలు"
పరిగి వేణుగోపాల్ రావ్MBA, LLB., బిజెపి నాయకులు